పరమప్రియులైన అవ్యక్తమూర్త మాత-పిత బాప్‌దాదాకు అతి గారాల పిల్లలు, యజ్ఞంలోని పూర్వజ ఆత్మల సూక్ష్మ సకాశ్ ద్వారా స్వ సేవ మరియు విశ్వ సేవలో సదా ముందుకు సాగేవారు, సదా సర్వశక్తిమంతుడైన బాబాను తోడుగా చేసుకుని సర్వులపట్ల శుభ చింతకులుగా అయ్యి వ్యర్థ చింతన మరియు చింతల నుండి ముక్తులై ఉండే నిమిత్త టీచరు అక్కయ్యలు మరియు సర్వ బ్రాహ్మణ కులభూషణ సోదరసోదరీలు,

ఈశ్వరీయ స్నేహ సంపన్న మధుర స్మృతిని స్వీకరించండి.

తర్వాత సమాచారము - ప్రస్తుతం మధుబన్‌లో చాలా చక్కని తపస్సు, భట్టీల అల ప్రవహిస్తుంది. విశేషంగా ఈ జులై నెలలో మనందరి అతి స్నేహి, బాప్‌దాదాకు కనుపాప, సత్యమైన హృదయ ప్రేయసి, పతివ్రత అయిన దీదీ మన్‌మోహినీ గారి మధుర శిక్షణలు, వారి దివ్యమైన పాలన సహజంగానే గుర్తుకు వస్తుంటాయి. 28 జులై, మనందరి మధురమైన దీదీ మన్‌మోహిని దీదీగారి స్మృతి దివసము. దీదీగారి దూరదృష్టి, పరిశీలనా శక్తి, ఈశ్వరీయ నియమాలను దృఢంగా పాటించడమే కాకుండా పాటించేలా చేసే శక్తిని అందరూ వర్ణిస్తారు. మీ అందరికీ దీదీగారి జీవిత చరిత్ర సుపరిచితమే.

దీదీగారి లౌకిక పేరు గోపి, వీరు ఎంతో పేరుగాంచిన ధనిక సింధీ కుటుంబం నుండి వచ్చారు. యజ్ఞ స్థాపన సమయంలో అనేక బంధనాలను తెంచుకుని వీరి లౌకిక తల్లిగారైన క్వీన్ మదర్ మరియు లౌకిక సోదరి శీలింద్రతో కలిసి ఒకే దెబ్బకు బలిహారమైపోయారు. వీరికి బాబాపై ఎడతెగని ప్రేమ ఉండేది, ప్రతి క్షణము, ప్రతి మాటలో బాబా బాబాయే అనేవారు. వీరు హృదయాభిరాముని సత్యమైన హృదయ ప్రేయసి. దీదీకి లభించిన అవ్యక్త పేరు - "మన్‌మోహిని". దీదీ సాన్నిధ్యంలోకి ఎవరు వెళ్ళినాగానీ, వారు బాబాకు అయ్యేలా దీదీ వారి మనసును మార్చేసేవారు.

దీదీకే బాబా మౌంట్ ఆబూను ఎంచుకునే సేవను ఇచ్చారు. 1950లో దీదీ ముందుగా ఆబూను ఎంచుకున్నారు, తర్వాత పూర్తి యజ్ఞాన్ని కరాచీనుండి ఆబూకు తీసుకువచ్చారు. 1952లో ఈశ్వరీయ సేవలు ప్రారంభమైనప్పుడు వీరు ముందుగా ఢిల్లీ, ఇలాహాబాదు మొదలైన స్థానాలలో తమ త్యాగము, తపస్సుల ఆధారంగా ఎన్నో సేవాకేంద్రాలను తెరిచేందుకు నిమిత్తమయ్యారు. మాతేశ్వరి జగదాంబగారు అవ్యక్తమైన తర్వాత 1965నుండి వీరు తిరిగి బాప్‌దాదాతోపాటు మధుబన్‌లో ఉంటూ యజ్ఞం యొక్క ఆంతరిక కార్య వ్యవహారాలను, పూర్తి పరిపాలనను సంభాళించడంలో బాబాకు కుడి భుజంగా అయ్యారు. 1969లో బ్రహ్మబాబా అవ్యక్తమైన తర్వాత దీదీ మరియు దాదీగార్ల జంట పూర్తి యజ్ఞాన్ని సంభాళించారు. ఇరువురూ కలిసి తల్లిదండ్రులవలె దేశవిదేశాలలో ఉన్న సర్వ బ్రాహ్మణ పరివారానికి నిస్వార్థ సేవలను అందించారు మరియు విశ్వమంతటిలో సేవలను బాగా పెంచారు. దీదీ-దాదీజంటను అందరూ - శరీరాలు రెండు, ఆత్మ ఒక్కటి అని అనేవారు. ఈ విధంగా ఐకమత్యానికి రుజువును చూపించి, ఇతరుల సలహాలకు గౌరవాన్ని ఇస్తూ యజ్ఞాన్ని నిర్విఘ్నంగా చేసి ముందుకు నడిపించారు.

దీదీగారు 28 జులై 1983 నాడు తమ భౌతిక దేహాన్ని త్యజించి అవ్యక్త వతనవాసిగా అయ్యారు. ఈరోజు వారి పుణ్య స్మృతి దివసము సందర్భంగా వారిలోని అనేకానేక విశేషతలు కళ్ళముందు తిరుగుతున్నాయి. వారి కొన్ని విశేషతలను మరియు శిక్షణలను మీ వద్దకు పంపుతున్నాము, వీటిని మన జీవితంలోనూ అనుసరిస్తూ మనం కూడా మన పూర్వజుల సమానంగా అయ్యి బాప్‌దాదాకు మంచి పేరును తీసుకురాగలము.

మీరు దీనిని మీ క్లాసులలో వినిపించి దీదీగారి జీవిత చరిత్రను అందరికీ అవగతం చేయించగలరు. ప్రతి సంవత్సరం దీదీగారి నిమిత్తంగా మధుబన్‌లో భోగ్ పెట్టడం జరుగుతుంది. మీరు కూడా మీ సేవా స్థానాలలో దీదీగారి నిమిత్తము విశేష భోగ్‌ను తప్పకుండా పెట్టండి. అచ్ఛా - అందరికీ చాలా- చాలా స్మృతి... ఓం శాంతి.

దీదీ మన్‌మోహినీ గారి ద్వారా ప్రాప్తించిన విలువైన శిక్షణలు

1. బాబా, పిల్లలైన మనందరినీ సంపన్నంగా తయారు చేయడానికి శ్రీమతాన్ని ఇచ్చారు. శ్రీమతంపై నడిచేందుకు ఆధారము – ఒకే బలము ఒకే నమ్మకము. ఇది శ్రీమతము అనే పునాది. బాబాపై పూర్తి విశ్వాసం ఉన్నప్పుడే మనం బాబా చెప్పిన ప్రతి సంకేతాన్ని కార్యంలోకి తీసుకురాగలము. ఎవరిపైనైతే విశ్వాసము ఉంటుందో, వారిచ్చిన సలహాలో మన అభిప్రాయాన్ని మిక్స్ చేయడమన్నది జరగదు. ఒక్క బాబా సలహాపై నడుచుకుంటే తేలికగా ఉంటాము. బాధ్యతను బాబాకిచ్చేసి మీరు తేలికగా ఉండండి అని బాబా అంటారు. బాబా అయితే ఇప్పుడు సాకారంలో లేరు కదా అన్న ఆలోచన రావడం కూడా సంశయమే. అమృతవేళ విధిపూర్వకంగా యోగంలో కూర్చున్నప్పుడు బాబా మనతో ఇచ్చిపుచ్చుకున్నట్లు అనుభవం అవుతుంది. స్వ స్మృతిలో ఉంటే బాబాకు మనతో ఏమి చేయించుకోవాలో అది చేయించుకుంటూ ఉంటారు. చేయించుకుంటున్నారు అన్న అనుభవం కలుగుతుంది.
2. ఒక శ్వాస తర్వాత మరో శ్వాస వస్తుంది, ఒక ఆలోచన తర్వాత మరో ఆలోచన వస్తుంది, రెండింటి రేసు జరుగుతుంది. కర్మ చేసేటప్పుడు శ్వాస వేగంగా ఉంటుంది, యోగంలో సంకల్పాల వేగం తెలుస్తుంది. ఒక్క బాబా స్మృతిలో, ప్రేమ సంకల్పాలలో ఏకాగ్రమై ఉంటే అన్ని రసాలు ప్రాప్తిస్తాయి. ఏకాగ్రవృత్తి అనే ధరణిపైన ప్రతి సంకల్పం ఫలిస్తుంది. ఇందుకోసం కర్మయోగం అభ్యాసం కావాలి. దినచర్యపై అటెన్షన్ ఉండాలి. అతీతంగా మరియు ప్రియంగా ఉండే స్థితి చాలా మధురమైన స్థితి.
3. ప్రతి విషయంలోనూ ముందుగా స్వయంలోని తప్పులను చూసుకోవాలి, అప్పుడే పరివర్తన మరియు ఉన్నతి జరుగుతాయి. మనం చేసే పురుషార్థం అనే నిచ్చెనలోని మొదటి మెట్టు – దేహసహితంగా దైహిక సంబంధాలనుండి ఉపరామము.కానీ ఇప్పటికీ ఈ మెట్టును చాలామంచి ఇంకా ఎక్కనే లేదు. ఇందుకోసం ప్రీతి ఒక్క బాబాతోటే ఉండాలి, ప్రపంచంతో కేవలం రీతిని నిభాయించాలి అని గుర్తుంచుకోండి.
4. సదా మీ స్వమానంలో స్థితి అయి ఉంటే ఫరిశ్తా స్థితి ఎంతో దూరంలో ఉండదు. అప్పుడప్పుడు బలహీన సంకల్పాలు వస్తున్నాయంటే అర్థము స్వమానమనే సీటు నుండి క్రిందకు దిగారు అని అర్థము. మహారథుల ముఖ్య లక్షణము ఫాలో ఫాదర్ మరియు ప్రతి అడుగు శ్రీమతం అనుసారంగా వేయడము. కావున ఇప్పుడు బాబా మన నుండి ఏ స్వరూపాన్ని అయితే ఆశిస్తున్నారో అది ఇప్పుడు మనం ప్రత్యక్షం చేయాలి. నేను ఏ కర్మను చేస్తానో, నన్ను చూసి ఇతరులు చేస్తారు అని సదా గుర్తుంచుకోండి. మనం బాబాకు హృదయ సింహాసనాధికారిగా అవ్వాలి. ఒకవేళ మనసు ముక్కలు ముక్కలై ఉంటే బాబా స్వీకరించరు.
5. బాబా హృదయానికి నా హృదయానికి తేడా ఉండకూడదు. ఎవరు ఎంత గుణవంతులైనా కావచ్చు, మనం వారిపై బలిహారమవ్వకూడదు. వీరిని ఇంత గుణవంతులుగా చేసినవారు ఎవరో వారిని చూడండి. అప్పుడు బుద్ధి డైరెక్టుగా వారి వైపుకు (బాబా వైపుకు) వెళ్తుంది. బాబా హృదయంతో మన హృదయం కలిసిపోయినప్పుడు అది ఇంకెక్కడికీ వెళ్ళలేదు. వీరిలో ఈ గుణము ఉంది, అందుకే వీరిపట్ల నాకు స్నేహము ఉంది, ఇది కూడా చాలా పెద్ద సూక్ష్మ మాయ. ఇప్పుడు మనం ఇటువంటి విషయాల నుండి కూడా అతీతమవ్వాలి. హృదయాభిరాముడికి హృదయాన్ని ఇచ్చేసిన తర్వాత బుద్ధిని మరెక్కడా ఇరుక్కోనివ్వకండి. మన ప్రపంచము, మన పరివారము ఒక్కటే – మనకున్నది ఒక్క బాబా, మరెవ్వరూ లేరు. ఇది కూడా మహారథుల లక్షణము. వీరివలనే కోట గట్టిగా ఉంటుంది.
6. మనందరికీ మొదటి రోజు నాలుగు నియమాలను వినిపిస్తారు కదా – 1. బ్రహ్మచర్యము 2. సత్సంగము 3. శుద్ధ అన్నము మరియు 4. దివ్య గుణాలు. మరి ఈ నియమాలను నేను పూర్తిగా ఎంత పాటిస్తున్నాను అని పరిశీలించుకోండి. కర్మణలోకి రాకపోయినా కానీ మనసులో సంకల్పాలు కూడా రాకూడదు. సదా సాంగత్య దోషము నుండి స్వయాన్ని రక్షించుకోండి. ఒక్కరిదే వినాలి, ఒక్కరినే మనసులో నిలుపుకోవాలి అన్న ఈ ఒక్క మాటను గుర్తుంచుకోండి. ఎక్కే కళలో ఉన్నవారి సాంగత్యాన్నే చేయండి.

7. యోగంతో నిజంగా నా వికర్మలు వినాశనమై ఉంటే నా పాత దేహ అభిమానపు స్వభావము మారిపోతుంది. బుద్ధి లైను క్లియర్ అవుతుంది. భారంనుండి తేలికగా అవుతారు. సదా ఎక్కే కళను అనుభవం చేసుకుంటారు. శ్రమ తక్కువ సఫలత ఎక్కువ లభిస్తుంది.
8. "ఇప్పుడు ఇంటికి వెళ్ళాలి" ఇది గుర్తుంటే ఆటోమేటిక్‌గా అన్ని వైపులనుండి మనసు తేలికగా అవుతుంది, ఏ పట్టింపు ఉండదు. తింటూ, త్రాగుతూ, లేస్తూ... ఇంటికి వెళ్ళాలి. దీనితో బాబా గుర్తుంటారు, పాత ప్రపంచం నుండి దూరమవుతూ ఉంటారు. అప్పుడు నీది, నాది, నేను చేసాను, వారిలా చేసారు... ఇటువంటి మాటలే వెలువడవు. ఇది కూడా మహారథుల లక్షణము.
9. నీలో ఈ బలహీనత ఉంది అని ఎవరైనా చెబితే వెంటనే అంగీకరించండి. కూర్చుని మెండిగా వాదించడము, నిరూపించుకునే ప్రయత్నము చేయడము, ఇది మన బ్రాహ్మణ పరివార నియమము కాదు.
10. ఎప్పుడూ ఎవరిపైనా ప్రభావితం కాకండి, బాబాయే మన ప్రపంచము, ఒక్క బాబా తప్ప మరెవ్వరూ లేరు. కొద్దిగా కూడా ఏ దేహధారిపై ఆకర్షణ ఉండకూడదు. ఒకవేళ ఎవరైనా సేవలో సహయోగిగా అయినా, ధన సహయోగం చేసినా, వారు వారి భాగ్యాన్ని తయారు చేసుకుంటున్నారు, మనం వారి వెనుక ఆకర్షితమవ్వకూడదు. నాకు ఎవ్వరి నుండి ఏమీ వద్దు, ఒక్క బాబానుండే అన్నీ తీసుకోవాలి. ఇచ్చిపుచ్చుకోవడం ద్వారా చాలా లోతైన లెక్క తయారవుతుంది కావున ఎవరితోనూ పర్సనల్ ఇచ్చిపుచ్చుకోవడం చేయకండి, అందరి సంబంధాన్ని బాబాతో జోడించండి, నాతో ఎవ్వరూ తమ సంబంధాన్ని జోడించకూడదు, ఈ విషయంపై చాలా శ్రద్ధ వహించాలి.
11. అన్నిటికన్నా పెద్ద రోగం నామరూపాలది, అతి చనువు (ఫెమిలియారిటీ) కూడా చాలా–చాలా నష్టపరుస్తుంది కనుక ఎప్పుడూ ఏ దేహధారిపైన మనసు పెట్టుకోకండి. ఒక్క బాబా తప్ప మరెవ్వరూ మన బుద్ధిని తమ వైపుకు ఆకర్షించరాదు. బాబాయే మన ప్రపంచము, నీతోటే తింటాను, నీతోటే నాట్యం చేస్తాను, నీతోటే నా మనసు విప్పి మాట్లాడుతాను... అన్ని సంబంధాల సుఖాన్ని ఒక్క బాబా నుండే తీసుకోవాలి. నాకైతే ఒక్క బాబా మరెవ్వరూ లేరు... ఈ పాఠాన్ని పక్కా చేసుకోవాలి.
12. మన మాటలు, చేతలు మరియు జీవనము అన్నీ సమానంగా ఉండాలి. చెప్పడము ఒకటి, చేయడము మరొకటి... ఇప్పుడు ఇది శోభించదు. ఎప్పుడూ ఇంట్లో గొడవపడకూడదు, ఒకరికొకరు ప్రేమగా ఉండాలి. ఇంట్లో గొడవ జరగకూడదు అని గుర్తుంచుకోండి. ఒకరు చెప్పారు మరొకరు విన్నారు అన్నట్లుగా ఉంటే వారినే బ్రహ్మాబ్జాలు అంటారు. ఎప్పుడూ అభిప్రాయభేదాలలోకి రాకండి. నువ్వు నేను, నీది నాది – ఇదంతా రావణుడు చేయిస్తాడు, మనమైతే రావణ సాంప్రదాయం నుండి ఇప్పుడు రాముని సాంప్రదాయంలోకి వచ్చేసాము కనుక రావణుని అంశ కూడా మనలో ఉండకూడదు.
13. ఈశ్వరీయ మర్యాదలు మన జీవితానికి అలంకారము, ఎప్పుడూ ఏ నియమాన్నీ సంకల్పంలో కూడా ఉల్లంఘించకండి. మర్యాదలు మనల్ని రక్షిస్తాయి కావున ఇందులో ఎప్పుడూ నిర్లక్ష్యంగా ఉండకండి. మర్యాదలను పట్టించుకునేవారిని బాబా పట్టించుకుంటారు.

దీదీగారి విశేషతలు (దాదీ జానకిగారి మాటలలో)

1. మధుబన్‌కి వచ్చి ఛోటే హాల్‌లో కూర్చున్నప్పుడు బాప్‌దాదా యొక్క డైరెక్టు మహావాక్యాలు గుర్తుకు వస్తాయి. దీదీ ఇక్కడ కూర్చుని ఎలా బాబా చెప్పే మురళి నుండి నోట్సు వ్రాసుకునేవారు, ఆ దృశ్యమంతా కళ్ళకు కనిపిస్తుంది. అసలైతే మధుబన్‌లోని ప్రతి స్థాన మహిమ అపరమపారమైనది, అందులోనూ ఈ హాలు యొక్క మహిమ విశేషమైనది. మనసులో ఈ స్థానం ముద్ర పడిపోయింది.
2. దీదీగారి శుభ కామనలు ఈరోజుకీ మనతో ఉన్నాయి. ఈ మాట అందరి హృదయాల నుండి వెలువడుతుంది ఎందుకంటే దీదీ స్వయం సర్వ కామనలను సమాప్తం చేసుకుని ఇతరుల కోసం శుభ కామనలను ఉంచారు. ఎలా అయితే జ్ఞాపకం మనసులో నిలిచిపోతుందో అలాగే వారి శిక్షణలు కూడా మస్తకంలో ముద్రపడిపోయాయి. వాటిని మర్చిపోలేను. దీదీగారు ఇచ్చిన శిక్షణలు నేటికీ అందరికీ గుర్తున్నాయి మరియు గుర్తుంటాయి.

3. మనోభిరాముడిని చూస్తే మనసుకు ప్రశాంతత లభిస్తుంది. మనోభిరాముడిని మర్చిపోలేనంతగా మనసు తయారవుతుంది. దీదీగారి పూర్తి జీవితం ఎలా గడిచింది? త్యాగము, తపస్సు మరియు సేవలలో గడిచింది. ఎవ్వరూ కాపీ చేయలేనంతగా త్యాగము చేసారు. ఇక తపస్సు అంటే నాకైతే ఒక్క బాబా మరెవ్వరూ లేరు అనేలా ఉన్నారు. సేవలలో కూడా బేహద్దుగా ఉండేవారు.

4. దీదీ కోసం బాబా అన్నారు – ఇష్టులు మరియు అష్టులకు ఎటువంటి కష్టము రాజాలదు. దుఃఖధామాన్ని ముందు పెట్టుకుంటే దుఃఖమే కనిపిస్తుంది కానీ రహస్యాలు నిండిన రహస్యము గుప్తంగా ఉంది. కలిసి ఉన్నాము, కలిసి ఉంటాము అనే పాత్రను భాగ్య విధాత ఇచ్చారు. దుఃఖము యొక్క విషయమే లేదు. ఈ ప్రేమ ఎప్పుడూ తొలగలేదు, ఎప్పటికీ తొలగదు. ఆత్మిక ప్రేమ కర్మాతీతంగా అవ్వడంలో, పరస్పరం ముందుకు వెళ్ళడంలో ఆశీర్వాదాల రూపంలో పని చేస్తుంది. ఇప్పుడు మేము నంబర్‌వన్‌గా దీదీ సమానంగా అవ్వాలన్న విషయాన్ని చూసి ఎంతో ఉల్లాసము పెరుగుతుంది. సమానంగా అయ్యే అభ్యాసం చేయండి, వారివలె ప్రతి సంకల్పంలో సేవా భావన, సమీపంగా తేవాలన్న భావనను ఉంచండి.

5. ఎటువంటి కారణానికైనా దీదీగారు ఒక్క సెకండులో నివారణను ఇచ్చేసేవారు. సేవ చేస్తూ కూడా ముందుగా బాబానే ఉంచేవారు. పైన క్రింద కూడా బాబాయే, ముందు బాబాయే, వెనుక బాబాయే, వారు ఏది చేయిస్తే అదే, రెండు పురముల మధ్యన మనకేమి చేసేదుంది! ఎలా అయితే రెండింటి మధ్యకు వచ్చి నలిగినప్పుడే గోధుమ తినే యోగ్యంగా అవుతుందో అలాగే ముందు వెనుక బాబాను ఉంచితే ఆత్మ మధ్యన నలుగుతుంది అనగా పవిత్రంగా, యోగ్యంగా అవుతుంది. అప్పుడే ఆత్మ క్రొత్త ప్రపంచానికి యోగ్యంగా అవుతుంది.

6. విషయాలైతే అనేకము మనముందుకు వస్తాయి, విషయాలను చూడకండి, డ్రామాను చూడండి. ఎలాంటి విషయము ముందుకు వచ్చినాగానీ, మన మమ్మా, తల్లి దానిని తనలో ఇముడ్చుకునేవారు. మిమ్మల్ని మా ఇద్దరి మధ్యన ఉంచండి అని బాప్‌దాదా అంటారు. అప్పుడు నలిగి నలిగి పావనంగా అవుతారు. తిరగలిలోని రెండు చక్రాలు కలిసి ఉంటాయి కదా. అలాగే బాప్‌దాదా ఇరువురూ కలిసి ఉంటారు. ఏదైనా విషయము వస్తే, బాబా బహుశా నాకు ఈ విషయం ద్వారా ఏదో నేర్పించదల్చుకున్నారు, చదివించదల్చుకున్నారు అని గుర్తుంచుకోండి.

7. ప్రియుడితో కలిసి నడిచేవారు, ఎలా నడిపిస్తే అలా నడిచేవారే ప్రేయసులు. వారే సద్గురువుతో కలిసి వెళ్తారు. సఖుడు, ప్రియుడు సంబంధాలను జోడించేందుకు నిమిత్తమయ్యారు మన దీదీగారు. వారు నోటితో ట్రైనింగు తక్కువ ఇచ్చారు, తమ జీవితంతో అన్నిటినీ నేర్పించారు. దీదీగారి నుండి మనకు మర్యాదా సంపన్నమైన జీవితం లభించింది. వారి శిక్షణలు చాలా మంచిగా అనిపిస్తాయి. టీచరు అయిన భగవంతుడిని మీరు మీ స్నేహితుడిగా చేసుకుంటే వారి శిక్షణలు సహజంగానే మీ జీవితంలోకి వచ్చేస్తాయి, ఇది సహజమైన యుక్తి అని దీదీ అనేవారు.

8. నీతోటే ఆడుకుంటాను, నీతోటే తింటాను... దీదీలోని ఈ సంస్కారము వారిని బాబా సమానంగా తయారు చేసింది. ఎలా అయితే దీదీ బాబాను తమ వారిగా చేసుకున్నారో, తమవారిగా చేసుకున్న కారణంగా బాబాతో కలిసి అందరికీ సకాశ్‌ను ఇచ్చేందుకు నిమిత్తమయ్యారు, అలా అని బాబా నావారు మాత్రమే కాదు, నా బాబా అందరివాడు అన్న అనుభవాన్ని దీదీగారు చేసుకున్నారు మరియు అందరితో చేయించారు.

9. దీదీ పుట్టినప్పటి నుండి వారిని తెలివైనవారు అనేవారు. త్వరగా మల్చుకోగలిగినవారే తెలివైనవారు. వీరు స్వయం బాబా సంకేతాల అనుసారంగా నడుచుకున్నారు, ఇతరులను కూడా బాబా సంకేతాలపై నడిపించారు. కొద్దిమంది విషయాన్ని నేరుగా చెప్పరు, తిప్పి తిప్పి మాట్లాడుతారు, వారిని తెలివైనవారు అనలేము. మనం విషయంలో ఏదీ మిక్స్ చేయకుండా తెలివైనవారిగా అవ్వాలి. సత్యత మరియు స్వచ్ఛతతో తెలివైనవారిగా అవ్వాలి.

10. మమ్మా మనల్ని ధారణామూర్తులుగా చేస్తే దీదీ మనల్ని పతివ్రతలుగా చేసారు. ఏ ఆత్మవైపుకూ మొగ్గుపాటు ఉండకూడదు అన్న విషయం దీదీ మనసులో ఎల్లప్పుడూ ఉండేది. సదా ఒక్క బాబాయందే ప్రీతి ఉండాలి. భగవంతుని ఇంట్లో ఎప్పుడూ ఎవ్వరూ అసత్యం చెప్పకూడదు. ఇదే దీదీకి సదా ఉన్న ఆశ. మరి దీదీ సమానంగా మనమందరమూ అవ్వాలి. పతివ్రత మరియు సతీవ్రతకు పక్కా రుజువును ఇవ్వాలి. అచ్ఛా – ఓం శాంతి.